సాక్షి
నిజామాబాద్
బుధవారం । 31 । జనవరి । 2024



కాలయాపన వద్దు

కమిటీల పేరుతో నిజాంషుగర్స్‌ను తెరిపించడంలో కాలయాపన చేయవద్దని కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు.

- 8లో ▸



నీటి కోసం కాపలా

ఎస్సారెస్పీ కాలువ ద్వారా తమ గ్రామానికి వచ్చే నీటిని ఇతర గ్రామాల ప్రజలు అడ్డుకోకుండా ధర్మోరా వాసులు కాపలా కాస్తున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /17.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలితీవ్రత కాస్త తగ్గవచ్చు.

ధర ఆశాజనకం!

కొన్నేళ్లుగా పసుపు పంటకు గిట్టుబాటు ధర లభించక నిరాశ పడిన రైతులకు ఈసారి ఆశించిన స్థాయిలో రేటు లభిస్తోంది. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాలుకు రూ.10వేల పైనే ఉన్న ధరను సీజన్ చివరి వరకు కొనసాగించాలని అధికారులను కోరుతున్నారు. మరో వారంలో మార్కెట్‌కు భారీగా పంట దిగుబడులు రానున్న నేపథ్యంలో వ్యాపారుల సిండికేట్‌పైనా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- క్వింటాలుకు రూ.10 వేల పైనే..
- పసుపు రైతుల్లో ఆనందం..
- సీజన్ చివరి వరకు ధర నిలకడపైనా అనుమానాలు ?
- ధర మరింత పెరిగే అవకాశం ఉందంటున్న వ్యాపారులు



బాల్కొండ మండలంలో మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన పసుపు

బాల్కొండ: ఈ ఏడాది పసుపు పంటకు ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా పంటకు ధర లేక పోవడంతో ప్రస్తుత సంవత్సరం పంట సాగును తగ్గించారు. సాగు చేసిన పంటకైనా ధర దక్కుతుందా అని అనుమానాలు సైతం వ్యక్తం చేశారు. కాగా రెండ్రోజులుగా రైతులు పసుపు పంటను అధికంగా నిజామాబాద్ మార్కెట్ యార్డుకు తరలిస్తున్నారు. మార్కెట్‌లో ధర పసుపు కొమ్ముకు క్వింటాలుకు రూ. 10 వేల నుంచి రూ.11 వేల వరకు, మండ(దుంప)కు క్వింటాలుకు రూ. 9 వేల నుంచి రూ.10 వేలు పలుకు తోంది. అయితే పంట ధర క్వింటాలుకు రూ. 10వేల కంటే తగ్గితే నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. దీర్ఘకాలిక పంటైన పసుపు సాగుకు ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతమున్న ధర సీజన్ చివరకు ఉంటుందా లేదా అనుమానాలు సైతం రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు వస్తున్న పసుపు మరో వారం రోజుల్లో భారీగా వస్తుంది. ఆ సమయంలో పసుపు ధరను తగ్గిస్తారనే ఆందోళన రైతులను వెంటాడుతోంది. ఇదిలా ఉండగా పసుపు బోర్డు ఏర్పాటుకు కార్యాచరణ కొనసాగుతోందని తాజాగా ఎంపీ అర్వింద్ నిజామాబాద్ మార్కెట్‌యార్డును సందర్శించిన సందర్భంగా పేర్కొన్నారు. అంతేగాకుండా రానున్న రోజుల్లో పసుపు పంట క్వింటాలుకు రూ. 20 వేల వరకు ధర పలుకుతుందని అన్నారు. దీంతో పసుపు రైతుల్లో ఆశలు మరింత చిగురిస్తున్నాయి.

2007లో ఇలాంటి పరిస్థితి..

దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో పసుపు పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడంతో క్వింటాలుకు గరిష్ఠంగా రూ.17 వేల వరకు ధర పలికింది. రెండుమూడేళ్లు అదే ధర కొనసాగడంతో రైతులకు మంచి రాబడులు వచ్చాయి. వైఎస్సార్ పాలనను రైతులు ఇప్పటికీ స్మరించుకుంటారు. అప్పటి ధరలు పునరావృతం అవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ అనంతరం గిట్టుబాటు ధరలు లేక పంటను క్వింటాలుకు రూ.4 వేలకే అమ్ముకోవాల్సి వచ్చింది.

సీజన్ చివరి వరకు..



పసుపు పంటను మార్కెట్‌లో సోమవారం విక్రయించాను. క్వింటాలుకు రూ.10,200 లకు అమ్ముడు పోయింది. సీజన్ చివరి వరకు ధర ఇలానే ఉంటే బాగుంటుంది. కొన్ని రోజులు అయితే ఎక్కువ మొత్తంలో పసుపు మార్కెట్‌కు వస్తుంది.

– ఆకుల చిన్నరాజన్న, రైతు, రెంజర్ల

సిండికేట్ కాకుండా చూడాలి



పసుపుపంటకు చివరి వరకు ధర పలికేల, వ్యాపారులు సిండికేట్ కాకుండా చర్యలు తీసుకోవాలి. పసుపు పంటకు నిలకడైన ధర ఉంటే రైతులకు నష్టాలు రావు. ప్రస్తుత సంవత్సరం పసుపు పంటకు ధర పర్వాలేదు.

– పెద్దారెడ్డి, రైతు, రెంజర్ల

సరైన ధర చెల్లించాలి

- పసుపు కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదు
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: పసుపు కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా.. సరైన ధర చెల్లిస్తూ పంట సేకరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు విక్రయాలు ఊపందుకుంటున్న నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం తన చాంబర్‌లో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైతుసంఘాల ప్రతినిధులు, ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. పసుపు పంటకు ప్రస్తుతం మార్కెట్‌లో పలుకుతున్న ధర, పంట దిగుబడి, నాణ్యత వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పసుపు క్వింటాలుకు నాణ్యత ఆధారంగా రూ.10 వేల నుంచి రూ. 12 వేల వరకు ధర లభిస్తోందని రైతు ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మార్కెట్‌కు పంట దిగుబడి ఎక్కువగా వస్తున్నందున ధర తగ్గే అవకాశం ఉందని, రైతులు నష్టపోకుండా ధర నిలకడగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన రైతులు నష్టపోవద్దని సూచించారు. సాగు విస్తీర్ణం తగ్గడం వల్ల ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు పంటకు ఆశించిన రీతిలోనే డిమాండ్ ఉందన్నారు. రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు, పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. బాగా ఆరబెట్టిన పసుపు యార్డుకు తీసుకువచ్చేలా గ్రామాల వారీగా రైతుల్లో అవగాహన పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఏవో వాజిద్ హుస్సేన్, మార్కెటింగ్ ఏడీ గంగు, ఉద్యాన శాఖ అధికారి నర్సింగ్ దాస్, రైతు సంఘాల ప్రతినిధులు అన్వేశ్ రెడ్డి, వి ప్రభాకర్, దేవరాం పాల్గొన్నారు.

పసుపు ధర నిలకడగా ఉంచాలి

- అధికారులు చర్యలు తీసుకోవాలి
- కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెట అన్వేశ్‌రెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న అన్వేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు పంట ధర నిలకడగా ఉండేలా మార్కెటింగ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జాతీయస్థాయిలోనే పసుపు సాగు 30 శాతం పడిపోయిందన్నారు. కలెక్టర్‌తో సమావేశం తర్వాత ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పసుపు సాగు క్రమంగా తగ్గిపోయిందన్నారు. గిటుబాటు ధర లభించకపోవడం, వ్యాపారులు సిండికేట్‌గా మారి కృత్రిమంగా ధర తగ్గించడం కారణాల వల్ల పసుపు సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదని కలెక్టర్ దృష్టికి అన్వేశ్‌రెడ్డి తీసుకొచ్చారు. మార్కెట్ యార్డులో పంట విక్రయించిన డబ్బులు చెల్లించడంలో జాప్యం, రూ.వందకు రూ.రెండు చొప్పున వడ్డీ విధిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని వ్యాపారుల మోసాలను వివరించారు. రైతులపై ప్రేమ ఉంటే బీజేపీ ప్రభుత్వం ఎంఎస్‌పీ నిర్ణయించాలన్నారు. పసుపును ఆహార పంటగా గుర్తించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. పసుపు బోర్డు ఏర్పాటైందా అని ప్రశ్నించగా, అధికారికంగా ఎలాంటి ఆదేశాలు రాలేవని అధికారులు సమాధానమిచ్చారన్నారు. సమావేశంలో రైతు సంఘాల నాయకులు వి ప్రభాకర్, దేవరాం, సురేష్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు స్టాఫ్ నర్సులకు ప్రొసీడింగ్‌లు

- సీఎం చేతుల మీదుగా అందజేత

నిజామాబాద్ రూరల్: జిల్లా పరిధిలో స్టాఫ్ నర్సులుగా ఎంపికైన 380 మందికి బుధవారం ప్రొసీడింగ్‌లు ఇవ్వనున్నట్లు జిల్లా వైద్యాధికారి సుదర్శనం తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం చేతులమీదుగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వీరిని బుధవారం ఉదయం ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

జీజీహెచ్‌లో పనిచేస్తున్న 104 మందికి..

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న 104 మంది నర్సింగ్ ఆఫీసర్లుగా ఎంపికయ్యారని సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ తెలిపారు. మొత్తం 112 మంది విధులు నిర్వహిస్తుండగా.. ఇందులో 104 మంది రెగ్యులర్ ఉద్యోగాలు రావడం సంతోషంగా ఉందన్నారు.

అమరవీరులకు నివాళులు



సుభాష్‌నగర్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే దృఢ సంకల్పంతో, వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఆర్డీవో రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌తో ఎస్‌ఎల్‌ఆర్ జేడీ సమావేశం

సుభాష్‌నగర్: సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్(ఎస్‌ఎల్‌ఆర్) జాయింట్ డైరెక్టర్(హైదరాబాద్) భాస్కర్, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో మంగళవారం తన గదిలో సమావేశమయ్యారు. జిల్లాలో గతంలో చేపట్టిన భూ భారతి సర్వేపై వీరు చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా భూ భారతి రికార్డులను పరిశీలించారు. అనంతరం జేడీ భాస్కర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీ చేశారు. వీరి వెంట ఎస్‌ఎల్‌ఆర్ ఏడీ శ్రీనివాసులు, డీఐలు, సర్వేయర్లు ఉన్నారు.

రెవెన్యూశాఖలోనే కొనసాగించాలని వినతి



సుభాష్‌నగర్: జిల్లాలో 123 మంది వీఆర్‌ఏలను మున్సిపాలిటీల్లో పీహెచ్ వర్కర్లుగా సర్దుబాటు చేశారని, తాము రెవెన్యూశాఖలోనే కొనసాగుతామని పూర్వ వీఆర్‌ఏలు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏ నవీన్‌మిట్టల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్ వర్కర్లమైన తాము మురికి కాల్వలు తీస్తున్నామని, రోడ్లు శుభ్రం చేస్తున్నామని వివరించారు. ఆ విధులకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. తమకు తిరిగి వీఆర్‌ఏగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ వీఆర్‌ఏలు రాజేశ్వర్, నర్సయ్య, రమేశ్, సు రేశ్, నాగరాజు, సాయిలు, బలరాం, గణేశ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలోనూ రోజ్‌గోల్డ్ బాధితులు

నాగిరెడ్డిపేట: బ్యూటీపార్లర్ల బిజినెస్ ద్వారా ఉపాధితో పాటు జీతం ఇస్తామని నమ్మించి, రూ. కోట్లు దండుకుని ఉడాయించిన రోజ్‌గోల్డ్ సంస్థ బాధితుల్లో ఎల్లారెడ్డి వాసులూ ఉన్నారు. పలువురు లక్షల్లో పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు. ఫ్రాంచైజీల ఏర్పాటులో నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఒకరు మధ్యవర్తిత్వం వహించినట్లు తెలిసింది. పార్లర్ల ద్వారా ఉపాధి పొందడంతోపాటు నెలనెలా రూ. 35వేల వేతనం కూడా వస్తుందని చెప్పడంతో చాలామంది ముందుకు వచ్చారు. నిర్వాహకులు సదరు మధ్యవర్తి ద్వారా ఒక్కో ఫ్రాంచైజీ కోసం రూ. 3.50 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. రెండునెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతోపాటు వారి ఫోన్లు స్విచ్ఛాఫ్ వస్తుండడంతో ఫ్రాంచైజీలు తీసుకున్నవారు ఆందోళన చెందుతున్నారు. బాధితులు ఎస్పీకి సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ధాన్యం విలువ ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలి

- లేకుంటే తదుపరి చర్యలకు సిద్ధం
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: జిల్లాలో ధాన్యం కేటాయించిన తొమ్మిది రైస్‌మిల్లులు సీఎంఆర్ ఇవ్వకుండా ధాన్యం దుర్వినియోగం చేశాయని, ఇప్పటికే మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దుర్వినియోగం చేసిన ధాన్యం విలువను గడువులోగా ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని, లేకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వానాకాలం 2021–22, యాసంగి 2021–22, వానాకాలం 2022–23 పంట కాలాల వరి ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ ఇవ్వలేదని పేర్కొన్నారు. ధాన్యం దుర్వినియోగం చేశారని పౌరసరఫరాలశాఖ అధికారుల విచారణలో తేలిందన్నారు. తొమ్మిది మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని, రెవెన్యూ రికవరీ చట్టం కింద రికవరీ చేయాలని సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. తక్షణమే సదరు రైస్‌మిల్లర్లు ధాన్యం విలువను ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైస్‌మిల్లు	గ్రామం	దుర్వినియోగమైన ధాన్యం(క్వింటాళ్లు)	ధాన్యం విలువ (రూ.కోట్లలో)
వెంకటలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్	పాల్దా	50,389.72	9,87,63,851
లక్ష్మి శ్రీదేవి ఇండస్ట్రీస్	సుభాష్‌నగర్	10,465.27	2,05,09,969
శేషాద్రి ఆగ్రో ఇండస్ట్రీస్	ఖానాపూర్	37,282.95	7,30,74,582
ఎంఎస్‌ఆర్ ఆగ్రో ఇండస్ట్రీస్	వర్ని	21,656.08	5,05,18,437
సర్ ట్రేడర్స్	వర్ని	19,753.12	4,65,34,089
లక్ష్మీగణపతి నరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్	కాలూరు	16,685.21	3,93,48,034
గంగా రైస్‌మిల్	వర్ని	34,099.84	8,09,03,473
దాదా బాయి ఇండస్ట్రీస్	బోధన్	22,679.39	5,43,69,441
రాయల్ ట్రేడింగ్ కంపెనీ	హుమ్నాపూర్	31,541.60	6,48,51,047

ప్రభారీల నియామకం

సుభాష్‌నగర్: బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారీలను మంగళవారం పార్టీ నియమించింది. నిజామాబాద్ ఎంపీ నియోజకవర్గ ప్రభారీగా వెంకట రమణిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియమించా రు. అలాగే మన జిల్లా నుంచి ఇద్దరికి ప్రభారీలుగా అవకాశం కల్పించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి అల్జాపూర్ శ్రీనివాస్, మెదక్ స్థానానికి బస్వా లక్ష్మీనర్సయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

29 మండలాలు.. తొమ్మిదిమందే ఎంఈవోలు

- అదనపు పనిభారంతో అధికారుల ఇబ్బందులు
- ప్రభుత్వ బడుల్లో పర్యవేక్షణ కరువు
- జిల్లాలో విద్యాశాఖ దుస్థితి



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ బడుల్లో విద్యా బోధన గాడి తప్పుతుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలన్నా.. మంచి ఫలితాలు సాధించాలన్నా.. విద్యాబోధన ఎంత ముఖ్యమో, పర్యవేక్షణ కుడా అంతే ముఖ్యం. ఇప్పటికే జిల్లాలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తుండగా, పర్యవేక్షించే అధికారుల కొరత కూడా తీవ్రంగా ఉంది. దీంతో సరైన పర్యవేక్షణ లేక విద్యా బోధన సక్రమంగా జరగడం లేదని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 789, ప్రాథమికోన్నత పాఠశాలలు 137, ఉన్నత పాఠశాలలు 269 ఉన్నాయి. ఇందులో పనిచేసే ప్రభుత్వ టీచర్లు 4897మంది ఉన్నారు. మండలస్థాయిలో వీటన్నింటిపై పర్యవేక్షణ చేసి, విద్యా బోధనను పకడ్బందీగా అందించాల్సిన ఎంఈవోలు మాత్రం కరువయ్యారు. జిల్లాలో 29 మండలాలు ఉండగా ఎంఈవోలు కేవలం 9 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో ఒక్కొక్కరికి నాలుగు నుంచి ఐదు మండలాలు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా, ఒకరికి ఏడు మండలాలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కానీ మండలాల మధ్య దూరం ఉండడంతో ఎంఈవోలు సరైన పర్యవేక్షణ చేయడం లేదు. నిజామాబాద్ సౌత్, నార్త్, ఎడపల్లి రెంజల్, మోపాల్, నవీపేట, నిజామాబాద్‌రూరల్ మండలాలకు సంబంధించి రామారావు ఒక్కరే ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగుతున్నారు. అలాగే నందిపేట మండల ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డికి ఇందల్వాయి, డొంకేశ్వర్, ధర్పల్లి మండలాల బాధ్యతలు అప్పగించారు. ఆర్మూర్ ఎంఈవో జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి మండలాల ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. మాక్లూర్ ఇన్‌చార్జి ఎంఈవో రాజు గంగారెడ్డి గతంలో బదిలీపై భిక్కనూరు బాలికల పాఠశాలకు వెళ్లారు. ప్రస్తుతం అతనే భిక్కనూరుతో పాటు మాక్లూర్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పనిభారం ఇలా..

ఎంఈవోలకు టీచర్ల సమయపాలనపై తనిఖీలు, సకాలంలో సిలబస్ పూర్తి, కాలానుగుణంగా టెస్టులు, పరీక్షలు నిర్వహించేలా చూడడం వంటి విధులుంటాయి. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, టీచర్ల గైర్హాజరును అరికట్టడం, ఉపాధ్యాయుల సెలవులు, ఆరోగ్య సమస్యల దరఖాస్తుల పరిశీలన, పాఠశాలలను తనిఖీ చేసి పరిస్థితులను మెరుగుపర్చాల్సి ఉంటుంది. కానీ ఎంఈవోల కొరతతో పనులు ప్రస్తుతం మరుగునపడ్డాయి. దీంతోపాటు ప్రైవేటు పాఠశాలల తనిఖీలు, అనుమతుల పరిశీలన కూడా కొనసాగడంలేదు. పదో తరగతి ఫలితాలు మెరుగుపరచడం కోసం ప్రత్యేక ప్రణాళికా రూపొందించి అమలు చేయాల్సి ఉండగా ప్రస్తుతం అదికూడా గాడితప్పింది. అలాగే టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు, ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాలు కూడా ఎంఈవోల కొరతల వల్ల నామమాత్రంగా సాగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఎంఈవోల కొరతను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థులు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది

నేను 7 మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. దీంతో అన్ని మండలాలను సక్రమంగా పర్యవేక్షణ చేయలేకపోతున్నా. అధిక పనిభారంతో ఇబ్బందిగా ఉంది. ప్రతి మండలంలో ప్రభుత్వ కార్యక్రమాలు ఉండడంతో హాజరుకాలేకపోతున్నాను.

– రామారావు, ఇన్‌చార్జి ఎంఈవో

జాగ్రత్తలు తీసుకుంటాం..

జిల్లాలో ఎంఈవోల కొరత ఇబ్బందిగానే ఉంది. అయినా కూడా ఎక్కడా పాఠశాలల్లో సమస్యలు రాకుండా జాగ్రత్త పడుతున్నాం. బడులపై పర్యవేక్షణ పక్బందీగా చేస్తున్నాం. నేను ప్రతిరోజు పాఠశాలలను తనిఖీ చేస్తున్నా.

– దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

ఎస్‌బీలో ఏళ్లుగా తిష్ట

- ఉద్యోగంతో పాటు వ్యాపారాలు
- అక్రమ దందాల నిర్వాహకుల నుంచి మామూళ్ల వసూలు!



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు చాలామంది ఏళ్ల నుంచి శాఖలోనే తిష్టవేశారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇక్కడే మకాం వేశారు. ఎస్‌బీ పోలీసులు సీపీ పరిధిలో పనిచేస్తుంటారు. వీరు కమిషనరేట్ పరిధిలోని సర్కిళ్లలో జరిగే అక్రమ దందాలు, ఇతర కార్యకలాపాలను ఓ కంటకనిపెట్టి కమిషనర్‌కు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. కానీ కొన్నేళ్లుగా ఎస్‌బీలోనే మకాం వేయడంతో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. అలాగే అక్రమ దందాలు చేస్తున్న వారి దగ్గర నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఒకవైపు విధులు నిర్వహిస్తూ.. మరోవైపు వ్యాపారాలు చేస్తున్నట్లు శాఖలోనే చర్చించుకుంటున్నారు. గంజాయి, పీడీఎస్ బియ్యం, మొరం అక్ర మ రవాణా, ఇసుక దందాలకు సంబంధించిన వివరాలపై సీపీ కార్యాలయానికి సక్రమంగా రిపోర్టులు అందించకపోవడంతోనే జిల్లాలో అక్ర మ దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు న్నాయి.

ఓ మహిళ ప్రజాప్రతినిధి భర్త అండ

స్పెషల్ బ్రాంచ్‌లో ఉండే ఓ పోలీసుకు ఓ మహిళ ప్రజాప్రతినిధి భర్త అండ ఉండడంతో ఏళ్ల నుంచి ఇక్కడే తిష్ట వేశారు. దీంతో పాటు తమకు అనుకూలంగా ఉండే సిబ్బందిని ఎస్‌బీలోనే ఉండేలా పావులు కదిపినట్లు తెలుస్తోంది. సదరు పోలీసులు విధులు నిర్వహిస్తూనే వ్యాపారాలు చేసుకుంటున్నట్లు పోలీస్‌శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కొంత మంది సిబ్బంది ఆరోపణలు వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదనే చర్చ సాగుతోంది.

ఇల్లీగల్ దందాలు చేస్తున్నా..

జిల్లాలో విచ్చలవిడిగా ఇసుక, మొరం, పీడీఎస్ బియ్యం, ప్రభుత్వ భూఆక్రమణల వంటి కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి దందాలపై ఎస్‌బీ అధికారులు ఇచ్చే వివరాలతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసే అవకాశం ఉంటుంది. కానీ జిల్లాలో ఇల్లీగల్ దందాలు జోరుగా సాగుతున్నా ఎస్‌బీ పోలీసులు 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

కొత్త వారికి అవకాశమేది..!

ఎస్‌బీలో ఏళ్ల నుంచి వారే ఉండడంతో పాటు కొత్త వారిని రానివ్వడం లేదనే చర్చ పోలీస్‌వర్గాల్లో ఉంది. సర్కిల్ పరిధిలో పనిచేసే వారు నిబంధనల ప్రకారం మూడు నుంచి నాలుగేళ్ల వరకే శాఖలో పనిచేయాల్సి ఉంటుంది. విధుల్లో నిక్కచ్చిగా ఉండి, ఆరోపణలు లేని వారినే ఎస్‌బీలోకి తీసుకుంటారు. కానీ ఏళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నా.. విధు ల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా.. కొందరు అక్రమాలకు పాల్పడుతున్నా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. శాఖలో కొన్నేళ్లుగా చాలా తక్కువ స్థాయిలో మాత్రమే బదిలీలు జరిగినట్లు సమాచారం.

నకిలీ పాస్‌పోర్టుల కేసులో ఎస్‌బీ ఏఎస్సై అరెస్ట్

- అదుపులోకి తీసుకున్న సీఐడీ
- సర్టిఫికెట్లను పరిశీలించకుండానే పాస్‌పోర్టులకు క్లియరెన్స్ ఇచ్చినందుకు..



ఖలీల్‌వాడి: నకిలీ పాస్‌పోర్టుల కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేస్తోంది. ఇప్పటికే ఈనెల 19న నిజామాబాద్ కేంద్రంగా పని చేస్తున్న భీమ్‌గల్ పట్టణానికి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ సుభాష్‌ను సీఐడీ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో పాటు అతని వద్ద ఉన్న ల్యాప్‌టాప్‌తో పాటు డ్యాకుమెంట్లను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం నవీపేట్, మాక్లూర్ ఎస్‌బీ ఏఎస్సై లక్ష్మణ్‌ను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించారు. మాక్లూర్, నవీపేట్ పరిధిలో పాస్‌పోర్టు విచారణలో ఆయన సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయకుండానే పాస్‌పోర్టుకు ఆన్‌లైన్ చేసినట్లు సీఐడీ అధికారుల విచారణలో తేలింది. దీంతో ఏఎస్సై లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిసింది. ఈ కేసులో లక్ష్మణ్‌ను సీఐడీ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తారా.. లేక విచారించి వదిలేస్తారా అనే చర్చ పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. పాస్‌పోర్టు ఏజెంట్ సుభాష్, ఎస్‌బీ ఏఎస్సైను అరెస్ట్ చేయడంతో ట్రావెల్స్ యాజమాన్యాల్లో గుబులు మొదలైంది. కేసులో కోరుట్ల, భీమ్‌గల్, హైదరాబాద్‌తో పాటు పలుచోట్ల సీఐడీ అధికారులు తనిఖీలు చేసి 90 మంది నకిలీ సర్టిఫికెట్‌లతో పాస్‌పోర్టులు పొందారని గుర్తించినట్లు తెలుస్తోంది. ఇందులో 14 మందిని అరెస్ట్ చేసినట్లు సమాచారం. కాగా మరో 30 మంది విదేశాలకు వెళ్లినట్లు సీఐడీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత



ఖలీల్‌వాడి: బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన హోంగార్డు జలంధర్ మృతి చెందగా, బాధిత కుటుంబానికి సీపీ కల్మేశ్వర్ రూ.30లక్షల యాక్సిడెంటల్ ఇన్సురెన్స్ చెక్కును మంగళవారం అందజేశారు. విధుల్లో భాగంగా గతేడాది ఆగస్టు 9న బైక్‌పై వెళ్తున్న జలంధర్ గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మృతుడి భార్య అర్చనకు సీపీ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ ఎస్.జయరామ్, ప్రొబేషనరీ ఐపీఎస్ బి.చైతన్యరెడ్డి, హోమ్ గార్డ్స్ ఏసీపీ పి.అరుణ్‌కుమార్, బాల్కొండ ఎస్సై కె.గోపి, బ్యాంక్ మేనేజర్ కె.గంగాధర్, సాలరీ మేనేజర్ సంపత్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాచ్‌టవర్ పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమట్‌పల్లి అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వాచ్ టవర్‌ను మంగళవారం సాయంత్రం ఢిల్లీ నుంచి వచ్చిన అరుణ్, జాన్సన్‌తో ముగ్గురు అటవీ శాఖ బృందం సభ్యులు పరిశీలించారు. నాగిరెడ్డిపేట రేంజ్ పరిధిలోని కోమట్‌పల్లి శివారులో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు గత కొంతకాలం క్రితం వాచ్ టవర్‌ను నిర్మించారు. వాచ్‌టవర్‌పై నుంచి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. టవర్ పైనుంచి 20 కిలో మీటర్ల పరిధిలో ఏం జరుగుతుందో తెలుసుకోవచ్చని, అగ్ని ప్రమాదాలు, కలప అక్రమరవాణాను గుర్తించవచ్చని వారు తెలిపారు. టవర్ నిర్మాణంపై ఢిల్లీ బృందం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వారి వెంట సీసీఎఫ్ సైదులు, ఎఫ్‌డీవో గోపాల్‌రావు, ఎఫ్‌ఆర్‌వో రమేశ్, ఓంకార్, అటవీశాఖ సిబ్బంది తదితరులున్నారు.

నంబర్ ప్లేట్ లేని బైక్‌లు సీజ్



డిచ్‌పల్లి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు డిచ్‌పల్లి సీఐ కే.మల్లేశ్, ఎస్సై యూ.మహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం సాయంత్రం డిచ్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్లు లేని 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మల్లేశ్ మాట్లాడుతూ.. వాహనాలకు తప్పనిసరిగా నంబర్‌లు ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేరుకే వైద్య విధాన పరిషత్

- విలీనమైన ఆస్పత్రుల్లో సిబ్బంది నియామకం లేదు
- వైద్యారోగ్యశాఖ పరిధిలోని వారితోనే వైద్య సేవలు
- ప్రస్తుత ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తే పోస్టుల భర్తీకి అవకాశం

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం వైద్యారోగ్యశాఖ పరిధిలోని సామాజిక ఆస్పత్రులను వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసింది. వైద్య నిపుణులు, సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలు రూపొందించి నిధులు కేటాయించకపోవడంతో వైద్యారోగ్యశాఖ పరిధిలోని వైద్యులు, సిబ్బందితోనే సేవలందిస్తున్నారు.



మోర్తాడ్‌లోని సామాజిక ఆస్పత్రి భవనం

మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలోని మోర్తాడ్, ధర్పల్లి, డిచ్‌పల్లి, బాల్కొండ, నవీపేట్, వర్నిలోని 30 పడకల ఆస్పత్రులతోపాటు ఆర్మూర్‌లోని వంద పడకల ఆస్పత్రిని గత ప్రభుత్వం వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసింది. వైద్య విధాన పరిషత్‌లో విలీనమైన ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన వైద్య నిపుణులు, సిబ్బంది నియామకం కోసం ప్రతిపాదనలు రూపొందించారు. భీమ్‌గల్ ఆస్పత్రి నిర్మాణంలో ఉండడంతో ఇక్కడ పోస్టుల భర్తీకి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

2023–24 ఆర్థిక సంవత్సరంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులను కేటాయించకపోవడంతో పోస్టుల భర్తీ పెండింగ్‌లో పడింది. నిధులు లేకుండా నియామకాలు చేపడితే వేతనాల చెల్లింపు ఎలా అనే సందేహంతో వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీని చేపట్టలేకపోయారు. వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసిన తరువాత పోస్టులను భర్తీ చేయకపోవడంతో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని వైద్యులు, ఉద్యోగులతోనే సేవలందిస్తూ నెట్టుకువస్తున్నారు. ఫలితంగా మెరుగైన వైద్య సేవలు ఇంకా అందుబాటులోకి రాకుండాపోయాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టే బడ్జెట్‌లో వైద్య విధాన పరిషత్‌కు నిధులను కేటాయిస్తే పోస్టుల భర్తీ ప్రక్రియ ముందుకుసాగే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులపై దృష్టి సారించి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సిబ్బంది నియామకం ఇలా..

30 పడకల ఆస్పత్రుల్లో 14 మంది వైద్య నిపుణులు, 18 మంది సిబ్బంది, వంద పడకల ఆస్పత్రిలో 48 మంది వైద్యులు, 73 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. జిల్లాలో అన్ని ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది కలిపి 313 పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీ చేయాలని ప్రతిపాదించారు.

నిధులు కేటాయిస్తేనే..

వైద్య విధాన పరిషత్‌కు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తేనే వైద్యులు, సిబ్బంది నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసి పోస్టులను భర్తీ చేస్తాం. పోస్టులను భర్తీ చేయడానికి ప్రతిపాదనలను ఎప్పుడో సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది.

– డాక్టర్ శివశంకర్, వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి

డీపీవో కార్యాలయం ఎదుట నిరసన

- తమ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారని ఆవేదన



నిరసన తెలుపుతున్న భార్యాభర్తలు

సుభాష్‌నగర్: సమీకృత కలెక్టరేట్ ఆవరణలోని జిల్లా పంచాయతీ కార్యాలయం (డీపీవో) ఎదుట డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామానికి చెందిన ఎలిగేటి రాజుబాయి, రాజలింగం కుమార్తె లలిత, ఆమె భర్త మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని 205 సర్వే నంబర్‌లో తన తల్లి రాజుబాయి పేరు మీద 2 గుంటల భూమి ఉందన్నారు. ఆ భూమిని మద్దుల రాజేందర్ కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై డీపీవోకు ఫిర్యాదు చేయగా డీఎల్‌పీవోతో విచారణ చేయించారని, సర్వే నంబర్ ఉండడంతో తహసీల్దార్‌తో సర్వే చేయించాలని చెప్పారన్నారు. సదరు సర్వే నంబర్‌కు టీపాన్ లేకపోవడంతో సర్వే చేయరాదని తేల్చి చెప్పగా, గ్రామపంచాయతీ సమావేశమై ఆ స్థలం మద్దుల రాజేందర్‌కు చెందిందని తీర్మానం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని, తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసుల జోక్యం చేసుకుని కోర్టులో తేల్చుకోవాలని వారిని సముదాయించి పంపించారు.

5 నుంచి 'గావ్ చలో అభియాన్'



సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జాతీయ నాయకత్వం పిలుపు మేరకు ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీవరకూ 'గావ్ చలో అభియాన్' (పల్లెకు పోదాం అభియాన్) నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో 'గావ్ చలో అభియాన్'పై జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా దినేశ్‌కులాచారి మాట్లాడుతూ.. నాలుగు రోజులపాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పర్యటించాలన్నారు. గావ్ చలో అభియాన్ స్టేట్ చీఫ్ కో ఆర్డినేటర్ యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ 51శాతానికి పెంచడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త గ్రామాల్లో పర్యటించి, బీజేపీ చేపట్టిన పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, గావ్ చలో అభియాన్ జిల్లా కన్వీనర్ స్వామియాదవ్, సహ కన్వీనర్లు సందీప్‌కుమార్, యామాద్రి భాస్కర్, కార్యక్రమ మండలాల కన్వీనర్లు, సహ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువ వద్ద నీటి కోసం కాపలా



కాలువ వద్ద కాపలాకాస్తున్న ధర్మోరా గ్రామస్తులు

బాల్కొండ: మోర్తాడ్ మండలం ధర్మోరా గ్రామస్తులు కాలువ వద్ద నీటికోసం కాపలా కాస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మి కాలువ డి–3 ఆధారంగా వేంపల్లి ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఎత్తిపోతల నుంచి నీటి సరఫరా చేసే ఎల్–2 కాలువ గుండా మోర్తాడ్ మండలం ధర్మోరా చెరువులోకి నీటి సరఫరా జరుగుతుంది. వేంపల్లి శివారులో వన్నెల్(బి), కోత్తపల్లి వెళ్లే మార్గం వద్ద చెరువులకు నీటి సరఫరా చేసే తూం ఉంది. నీటి సరఫరా సక్రమంగా జరగకుండా ఇతర గ్రామాల రైతులు నీటిని తరలించుకుపోకుండా నిత్యం వంతుల వారీగా గ్రామస్తులు కాపలా కాస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కాలువ వద్దనే ఉంటున్నారు. నీటి పంపకాల్లో వివాదాలు తలెత్తకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు నిత్యం నలుగురి చొప్పున వంతులు వేసుకుని కాపలా కాస్తున్నారు. ఉన్నతాధికారులు నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రదర్శన కేంద్రాలకు ఈవీఎంల కేటాయింపు

- పర్యవేక్షించిన కలెక్టర్, అదనపు కలెక్టర్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈవీఎంల పనితీరుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వీలుగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటుచేయనున్న ప్రదర్శన కేంద్రాలకు (డెమోన్‌స్ట్రేషన్ సెంటర్లు) ప్రయోగాత్మక పరిశీలనకు వీలుగా మంగళవారం ఈవీఎంలను కేటాయించారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి జిల్లా పరిధిలోని ఆయా నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ఈ ప్రక్రియ నిర్వహించారు. పోలీసు బందోబస్తుతో సంబంధిత సెగ్మెంట్ల అధికారులు కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలను తమ వెంట తీసుకెళ్లారు. ఈవీఎం గోడౌన్‌లోనే వాటి పని తీరును పరిశీలించి అధికారులకు అందజేశారు. ప్రజలు డెమోన్‌స్ట్రేషన్ సెంటర్లను సందర్శించి ఓటింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవడంతోపాటు ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పనితీరుపై సందేహాలు నివృత్తి చేసుకునేందుకు వీలుగా యంత్రాలను కేటాయించామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలు వెలువడిన వెంటనే ఈ కేంద్రాలను ప్రజల సందర్శన కోసం అందుబాటులో ఉంచుతామన్నారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ పేరుతో కాలయాపన వద్దు

బోధన్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూతపడిన ఉన్న నిజాంషుగర్ ఫ్యాక్టరీలను తెరిపించేందుకు ఏర్పాటు చేసిన కమిటీపై ఎన్డీఎస్‌ఎల్ కార్మిక సంఘాల ప్రతినిధులు రవి శంకర్‌గౌడ్, ఉపేందర్, కుమార స్వామి స్పందించారు. కమిటీ ఏర్పాటును తాము స్వాగతిస్తున్నప్పటికీ.. కాలయాపన చేయొద్దని కోరారు. ఈ మేరకు వేర్వేరు ప్రకటనలను మంగళవారం విడుదల చేశారు. అలాగే ఫ్యాక్టరీ ప్రధాన గేటు ఎదుట కార్మిక నాయకుడు రవిశంకర్‌గౌడ్ కార్మికులతో కలిసి మాట్లాడారు. కమిటీలో బాధిత కార్మికులు, చెరుకు రైతులకు చోటివ్వాలన్నారు. షుగర్ ఫ్యాక్టరీల ప్రైవేటీకరణ నాటి నుంచి 2015 డిసెంబర్ 23 వరకు గత ప్రభుత్వాల నేతృత్వంలో పలు కమిటీలు ఏర్పాటు కాగా, ఆ కమిటీల నివేదికలు బుట్టదాఖలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి ఫ్యాక్టరీలను మూసివేసి ఎనిమిదేళ్లు గడిచిపోయిందన్నారు.

పథకం ప్రకారమే హత్య..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని సోమారం శివారులో ఈనెల 21వ తేదీన జరిగిన ముదాం శంకర్ హత్య కేసును పోలీసు ఛేదించారు. వివాహేతర సంబంధమే హత్యకు దారితీసిందని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం వెల్లడించారు. తాడ్వాయికి చెందిన శంకర్ భార్య లక్ష్మితో గ్రామానికి చెందిన సుర్కంటి మనోహర్‌రెడ్డి వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. భర్తను అడ్డుతొలగించుకోవాలనుకున్న లక్ష్మి.. శంకర్‌ను హత్య చేయాలని మనోహర్‌రెడ్డికి సూచించింది. దీంతో మనోహర్‌రెడ్డి సోమారం గ్రామానికి చెందిన జంక శ్రీనివాస్‌తోపాటు అతడి భార్య యాదమ్మను సంప్రదించాడు. శంకర్‌ను హత్య చేస్తే రూ.2లక్షలు ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. పక్కాప్లాన్‌తో శ్రీనివాస్, యాదమ్మ బ్రాహ్మజివాడి శివారులోని సిద్దులగుట్ట వద్దకు శంకర్‌ను రప్పించి ఇనుపరాడ్‌తో దాడిచేసి హతమార్చారు.

టీఎస్‌ఆర్‌జేసీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బాల్కొండ: తెలంగాణ గురుకుల విద్యాసంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 35 గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం టీఎస్‌ఆర్‌జేసీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ తారాసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోచంపాడ్ బాలుర, మద్నూర్ బాలుర, సర్వేల్ బాలుర, పోచంపాడ్ బాలికల, ఎడపల్లి బాలికల, వరంగల్ జిల్లాలోని హసన్‌పర్తి బాలికల కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, ఇంగ్లిష్ మీడియం కోర్సుల్లో ప్రవేశానికి ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 16 వరకు http:tsrjdc.cgg.gov.inwebsite ద్వారా రూ.200 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 98665 59693 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణకే ఆదర్శంగా అభివృద్ధి చేసుకుందాం

- ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ప్రజాప్రతినిధులందరూ రాజకీయాలను పక్కన పెట్టి ఆర్మూర్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా అభివృద్ధి చేసుకునేలా కలిసి రావాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మూర్ ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో కుంటుపడిన అభివృద్ధిని తిరిగి సాధించుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు సంపన్నులకు అందితే పేదలు అన్యాయానికి గురవుతారన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు అధికారులను అవహేళన చేస్తే విధి నిర్వహణలో వారి ఆత్మస్థైర్యం దెబ్బతింటుందన్నారు. ఇక నుంచి నియోజకవర్గంలోని పల్లెల్లో అభివృద్ధి నినాదం వినిపించాలన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ విఠల్‌రావుతో కలిసి ఎమ్మెల్యే పదవీకాలం ముగిసిన సర్పంచ్‌లను సన్మానించారు. జెడ్పీటీసీ సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్మూర్, ఆలూర్ తహసీల్దార్లు శ్రీకాంత్, నరేశ్, ఎంఈవో రాజగంగారాం పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మద్దేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అభంగ పట్నం, మట్టయ్యపారం, అబ్బాపూర్(బి), మద్దేపల్లి, యంచ, నందిగామ గ్రామాల్లో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబ పాలన మోజులో గత ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని విస్మరించిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్, హరీశ్‌రావులు అర్థరహిత ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని అలీ సాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలకు గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, జెడ్పీటీసీ సవిత, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాజేంద్ర కుమార్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, గోపాల్, మూస, బాబు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



కుర్మ లక్ష్మయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం గ్రామానికి చెందిన రైతు కుర్మ లక్ష్మయ్య(47) గడ్డికోత యంత్రంతో పొలంలో గడ్డి కోస్తుండగా విద్యుత్‌షాక్‌తో మంగళవారం మృతి చెందాడు. మృతుడు లక్ష్మయ్య అదే గ్రామానికి చెందిన టేకులపల్లి గోపాల్ రెడ్డి వ్యవసాయభూమిని గతకొంతకాలంగా కౌలుకు చేస్తున్నాడు. యంత్రంతో గడ్డికోస్తుండగా విద్యుత్‌వైరు తగిలి లక్ష్మయ్య కిందపడిపోయాడు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు గమనించి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, లక్ష్మయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య మల్లవ్వ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ముదక్‌పల్లికి చెందిన గంగుబాయి (73) జిల్లాకేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తన కుమార్తె శాంతతో కలిసి గ్రామంలో నివాసం ఉంటున్న గంగుబాయికి కాళ్లు, చేతులు పని చేయకపోవడంతో నడవలేని స్థితిలో ఉంది. బీడీ తాగే అలవాటు ఉన్న ఆమె.. ఈనెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బీడీ వెలిగించుకునేందుకు పొయ్యి వద్దకు వెళ్లగా నిప్పురవ్వ ఆమె కప్పుకున్న దుప్పటిపై పడి మంటలు అంటుకున్నాయి. గంగుబాయి అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే 70శాతం కాలిన గాయాలతో గంగుబాయి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి కుమార్తె శాంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గూడ్స్‌రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: జానకంపేట్ రైల్వే గేటు వద్ద గూడ్స్‌రైలు ఢీకొట్టిన ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి (45) మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 58591, 94409 99341 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కాలువ పక్కన మహిళ మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాంగ్ర శివారులో రైల్వేపట్టాల వెంబడి కాలువ పక్కన గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతురాలి వయస్సు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందని, శరీరంపై గులాబీరంగు చీర, ముదురు నీలం రంగు జాకెట్ ఉన్నాయన్నారు. మృతదేహం సమీపంలో తంబాకు సంచి, సున్నం డబ్బా లభించాయని, మహారాష్ట్రకు చెందిన మహిళ అయి ఉంటుందని భావిస్తున్నామన్నారు. 5 నుంచి 10 రోజుల మధ్య రైలులో నుంచి పడి గాయాలై మృతి చెందినట్లు అనుమానంగా ఉందన్నారు. వివరాలకు నాల్గో టౌన్ పోలీసులను (87126 59840, 87126 59719) సంప్రదించాలన్నారు.





జీజీహెచ్‌లో తీరు ఇదేనా..



జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. 'బువ్వ కుండ' భోజనం తర్వాత విస్తరాకులను తొలగించే వారు లేరు. కనీసం అక్కడ డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయకపోవడంతో విస్తరాకులు నేలపై విసిరేసిన మాదిరి కనిపించాయి. ఇదిలా ఉండగా ఆవరణలో ఏర్పాటు చేయకుండా మరుగుదొడ్ల వద్ద ఉంచిన డస్ట్‌బిన్‌లను ఫొటోలను తీస్తుండగా అక్కడి ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు 'సాక్షి' ఫొటోగ్రాఫర్‌ను దబాయించారు. సెక్యూరిటీ గార్డుల తీరుతో తాము కూడా ఇబ్బందులు పడుతున్నామని ఆస్పత్రిలో రోగుల బంధువులు ఈ సందర్భంగా వాపోయారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

వీడీసీ సభ్యుల బైండోవర్

డిచ్‌పల్లి: మండలంలోని కొరట్‌పల్లి, ధర్పల్లి మండలం మైలారం గ్రామాలకు చెందిన వీడీసీ సభ్యులను డిచ్‌పల్లి పోలీసులు తహసీల్దార్ రాజేందర్ ఎదుట మంగళవారం బైండోవర్ చేశారు. ఎస్సై యూ.మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొరట్‌పల్లి, మైలారం గ్రామాల మధ్య ఉన్న వాగు విషయంలో రెండు గ్రామాల వీడీసీ సభ్యులు తరచూ గొడవ పడుతున్నారు. మళ్లీ గొడవ జరిగే అవకాశం ఉండడంతో మైలారం గ్రామానికి చెందిన 12 మంది వీడీసీ సభ్యులను, కొరట్‌పల్లికి చెందిన 13 మంది వీడీసీ సభ్యులను ముందు జాగ్రత్తగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి రూ.2లక్షల పూచీకత్తుపై వదిలేశారు. అనంతరం రెండు గ్రామాల వీడీసీ సభ్యులకు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ కౌన్సిలింగ్ ఇచ్చారు. వీడీసీ అనేది చట్టబద్ధమైన వ్యవస్థ కాదని, గ్రామాల్లో వీడీసీ సభ్యులుగా ఉన్నా, వీడీసీ పేరుతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడీసీ ఆగడాలపై బాధితులు, ప్రజలు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ అన్నారు.

సైబర్ మోసగాళ్లకు చిక్కొద్దు



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

మాక్లూర్: సైబర్ మోసగాళ్ల వలకు చిక్కొద్దని సైబర్ క్రైం డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో టెలీకాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్‌రెడ్డి సైబర్ మోసాలు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టెలీకాం సర్వీసులు, ట్రాయ్ యాప్‌లు, 5జీపై ట్రాయ్ జాయింట్ అడ్వైజర్ కేవీ సురేశ్‌బాబు అవగాహన కల్పించారు. సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ చింతరాల భిక్షం, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శాలువకుమార్ రాజా, వైస్ ప్రిన్సిపల్ సాయారెడ్డి, హెచ్‌వోడీ ఈసీఈ మహిపాల్, బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

దోమకొండ: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ దోమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పట్టుబడ్డ ఇద్దరికి కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై మురళి తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన చాంద్‌పాషా, ఒగ్గు రాజమల్లుకు న్యాయమూర్తి జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్ గ్రామానికి చెందిన అప్పాల లక్ష్మి ఈ నెల 28న తన ఇంటికి తాళం వేసి జలాల్‌పూర్‌లోని తల్లి గారింటికి వెళ్లింది. 29వ తేదీన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి నాలుగున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లారు. ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించిన చుట్టుపక్కల వాళ్లు లక్ష్మికి సమాచారం అందించారు. ఇంటికి చేరిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.